# ఇద్దరబ్బాయిలు

సామర్లకోటలో రైలాగింది. సరిగ్గా ఆ సమయానికే వెంకట్రావు శవసాహిత్యం తాలూకు పుస్తకాన్ని చదివేశాడు. హంతకుడెవరో తెలిసిన తర్వాత, అతని మనసు కాస్త కుదుటపడింది. 'అమ్మయ్య' అని నిట్టూర్చాడు.

తలెత్తి తనున్న కంపార్టుమెంటుని కలియ జూశాడు. అదృష్టవశాత్తూ జనం అట్టె రద్దీగాలేరు. మరింత అదృష్టం (ముఖ్యమైనది) ఏమిటంటె – సరిగ్గా తన సీటుముందు ముగ్గురమ్మాయిలు చక్కగా అలంకరించుకుని కూర్చున్నారు. 'హబ్బా, యెంత అదృష్టం' అనుకుంది అతని మనసు.

మళ్ళీ ఓమాటు కంపార్టు మెంటునంతా గాలించాడు తనలాటి యువకులెవరైనా కంటికి కనిపిస్తారేమోనని. ఎవ్వరూలేరు. పైగా వున్నవారంతా వయస్సు మళ్ళిన వారేను. ఇది పెద్దఅదృష్టం!

ఒకసారి క్రాపుని చేతితో అందంగా నిమిరాడు. కాలరెత్తుకున్నాడు. సిగరెట్టు తీసి ముట్టించాడు. ఇన్నిపనులూ సక్రమమైన వివిధ భంగిమలలో చేశాడు. మనసారా తృప్తి చెందాడు.

అప్పుడే కంపార్టుమెంటులో కాలుంచిన యువకుణ్ణి చూడగానే నోట్లో సిగరెట్టు అనుకోకుండానే జారి కిందపడిపోయింది.

సూట్ కేస్ – ఫుల్ సూటు – నెక్ టై నల్లకళ్ళద్దాలు – నోట్లో కాలుతున్న సిగరెట్టు. అతను రావడంలోనే సెంటుకంపు గుమాయించేసింది. వెంకట్రావు హృదయంలో బరువు మూలిగింది.

అతను వచ్చీ రావడంతోనే 'హల్లో' అని వెంకట్రావుని విష్‌చేశాడు. చచ్చినట్టు ఫీలయ్యాడు వెంకట్రావు.

అతను నల్లకళ్ళద్దాలు తీశాడు! నవ్వుతూ నిలబడ్డాడు! అతను ముకుందం! అదిరిపోయాడు వెంకట్రావు. ఇక్కడ కూడా కాంపిటీషనా?

"అప్పుడే మరిచిపోయావుట్రా!" వెంకట్రావుభుజం చరిచి అతనిపక్కన కూర్చున్నాడు ముకుందం.

"బాగా మారిపోయావు" నసుగుతూ అన్నాడు వెంకట్రావు.

"దొడ్డమ్మ కులాసాయేనా? పెదనాన్న, విమలక్కా అందరూ క్షేమమా?"

"అంతా కులాసాయే...అవునూ... అన్నట్టు ఎందాకా ప్రయాణం?"

---

'ఆదివిష్ణ'



"బెజవాడ."

ఉలిక్కిపడ్డాడు వెంకట్రావు.

"మావయ్యని చూట్టానికా?" ఉండబట్టలేక అడిగేశాడు వెంకట్రావు.

"ఎంతమాట! నాకు చాలా ఆశ్చర్యంగావుందిరా వెంకూ? నువ్విలా అడుగుతావని అనుకోలేదు సుమా!" ఇంగ్లీషులో వందరై పోయాడు ముకుందం.

వెంకట్రావు మనసు కులాసా పడింది యీ మాటతో.

"ఇంకా మావయ్య ఎవడోయ్ వల్ల

కాట్లో పరంధామయ్య! మావయ్యకంటే పెద్దది దొడ్డమ్మ! దాదాపు ఆవిడ చేతిలో పెరిగాడు యీ పెద్దమనిషి! అలాంటిది 'వద్దురా, నీకీ పెళ్ళి తగదూ' అని హిత బోధ చేస్తే, వినిపించుకోకుండా ఎవర్తో పరాయికులందాన్ని చేసుకున్న తర్వాత యింకావాడు మనకిమావయ్య ఏమిటోయ్? అప్పట్తోనే మంట కలిసిందిరా చుట్టరికం."

చాలా సీరియస్‌గా తిట్టేసి, ఆనక తీరుబడిగా సిగరెట్టు ముట్టించాడు ముకుందం.

"మ రే ... మ హ బాగాఅన్నావ్! ఇంకా చుట్టరికమేమిటి మరీను? ఇరవై సంవత్సరాలనుంచీలేంది యివ్వాళ ఆయన కావలసి వస్తాడా?" ఓ కన్ను ముందున్న



అమ్మాయిలమీద నిగావేసి అన్నాడు వెంకట్రావ్.

"మరి నువ్వెక్కడికో చెప్పావు కాదు —" సిగరెట్టునుసి వయ్యారంగా దులుపుతూ అడిగాడు ముకుందం.

"బెజవాడ—" ఆదమరపున అనేసి తర్వాత కసిక్కున నాలిక కొరుక్కున్నాడు వెంకట్రావు.

"కొంపతీసి మావయ్యా... ?"

"ఛ...ఛ...మొత్తానికి పోనిచ్చావు కాదు నీ బుద్ధి ! వాడితో నాకు పనేమిటోయ్. నాకేదో ఆఫీసు పని తగిలితేను వెళ్ళాల్సి వచ్చింది. అంతే" బొంకాడు. ఇంత చక్కటి సమయస్ఫూర్తికి తనకు తనే మురిసిపోయేడు.

"మా క్లాసుమేటు పెళ్ళి. వెళ్ళక తప్పిందికాదు. అందుకే బయలుదేరాను." అన్నాడు ముకుందం.

"ఆ...అన్నట్టు యీమధ్య మావయ్య వ్యాపారంలో లక్షలు సంపాయించాట్ట లక్షలు...తెలుసా నీకు." అని మళ్ళీ అడిగాడు వెంకట్రావుని.

"విన్నాను." ఇంత సంగతి అమాంతంగా ముకుందానికి తెలీడం యిష్టంలేక పోయింది తనకి.

రైలు గట్టిగా కూత పెట్టింది. ముందున్న అమ్మాయిల్లో ఒక అమ్మడు చెవులు మూసుకుంది. తతిమా యిద్దరూ కిసుక్కున నవ్వారు. బలే యిదిగా ఆనందమయ్యింది వెంకట్రావుకి.

రైలు కదిలింది. ఇద్దరిమధ్యా కుటుంబ విషయాలు గూడా కదిలాయి. వెంకట్రావూ, ముకుందం యిద్దరూ అక్కాచెల్లెళ్ళ బిడ్డలు. వెంకట్రావు తునిలో పనిచేస్తున్నాడు. ముకుందం కాకినాడలో మెడిసిన్ చదువుతున్నాడు.

వాళ్ళ తాలూకు మేనమావ సాంబశివంగారని బెజవాడలో పెద్ద వ్యాపారం చేస్తున్నాడు. ఆయన యిరవై సంవత్సరాల క్రితం వర్ణాంతర వివాహం చేసుకోవడం మూలంగా కులంనుంచి వెలివేయబడ్డాడు. నాలుగేళ్ల క్రితం అన్నపూర్ణమ్మ (సాంబశివంగారి భార్య) కన్నుమూశారు. మావయ్యకి ఒక్కర్తే కూతురు. చక్కని చుక్కట. పేరు పద్మ.

టూకీగా యీ కథకి పనికొచ్చే వివరాలింతే ! ఇక కథ ప్రారంభిస్తాను. ఎక్కడివరకూ వచ్చాం — ఆ...రైలు కదిలింది కదూ వాళ్ళ కుటుంబవిషయాలతోపాటు. ఇకచదవండి—

"చదువు పూర్తయిన తర్వాత ప్రాక్టీసెక్కడ పెడతావ్ ?" వెంకట్రావు అడిగాడు.

"ఇంకా నిర్ణయించుకోలేదు."

"బాబాయి వాళ్ళూ పూరీజగన్నాథం వెడుతూన్నార్ట."

"అట."

"మా నాన్నకి ఉత్తరం రాశారాయన వీలైతే మీరూ రండని. కాని మా నాన్న కిప్పట్లో ఎక్కడికీ కదలాలని లేదు.

మహారాణీపేటలో యిల్లుకట్టే ప్రయత్నాల్లో వున్నారు. బహుశా నాగ్గూడా విశాఖపట్టణం ట్రాన్స్‌ఫర్ రావచ్చు." తనింత సేపూ పనిగట్టుకుని మాటాడుతున్నా కిక్కురమనకుండా వింటున్న ముకుందంవైపు చూశాడు. ముకుందం తమకెదురుగావున్న మధ్య అమ్మాయిని తదేకంగా చూస్తున్నాడు.

ఆ అమ్మాయి బంతిపువ్వులాగా బహు చక్కగా వున్నది. చిన్ననోరు, కోటేరులాటిముక్కు, పెద్ద పెద్ద అందమైన కళ్ళు. నయాపైసంత ముచ్చటైనబొట్టు ముకుందాన్ని ఆకర్షించవచ్చు. తనలాటి మనసేకదా అతనిదీను!

అతని వరసగమనించి, తను చెప్పడం మానేశాడు వెంకట్రావు. తన నిమిత్తం లేకుండానే 'అహ...వుహూ...అల్లాగా' ల్లాటి ముక్కమాటలు ప్రయోగిస్తున్నాడు ముకుందం.

ఉన్నట్టుండి బంతిపువ్వు ఘొల్లున నవ్వింది!

ఉలిక్కిపడ్డారు ఇద్దరబ్బాయిలూ!

"ఏమిట్రా అడిగావ్?" అన్నాడు ముకుందం. ఏం చెప్పాలో తెలీక బిక్కమొగం పెట్టాడు వెంకట్రావ్.

"అవును. నా పెళ్ళిసంగతి కదూ నువ్వడుగుతుంట?"

ఇబ్బందిగా తలూపాడు వెంకట్రావు.

"నా కిప్పట్లో చేసుకోవాలని లేదు." అని యింగ్లీషులో అని–"అయినా యిప్పట్లో ఎందుకూ?" తెనుగులో చెప్పేసి ముఖం తుడుచుకున్నాడు జేబురుమాలుతో ముకుందం. 'ఏలాగైనా ఘటికుడేసుమా' అన్నది వెంకట్రావు మనసు.

బంతిపువ్వు అసలెందుకు నవ్వింది? పరిశోధనలో తలనిండుగా మునిగిపోయేడు వెంకట్రావు. తమ పరాకుని గమనించైనా కావచ్చు–లేదా–తన మిత్రురాలువేసిన 'విట్టు' (యిది 'యిమాజినేషనై'నా పాజిబిలిటీ వున్నదిగదా!) కైనాగావచ్చు. ఈ రెండో కారణాన్నే సమర్థించి యింత గాలి పీల్చుకున్నాడు వెంకట్రావు.

అలా నవ్వ మొదలుపెట్టిన 'బంతిపూవు' రాజమండ్రీ స్టేషనొచ్చేంతవరకూ నవ్వుతూనే వున్నది–మధ్య మధ్య నేస్తురాళ్ళ చెవుల్లో ఏదో వూదేస్తూ. దిగాలుపడిపోయారు యిద్దరబ్బాయిలూ.

నవ్వు నాలుగురకాల చేటు అని ఓ సూత్రం. అందునా ఓ ఆడకూతురు యిలా పట్టపగ్గాలేకుండా ఓ మిడిసిపడిపోతూ పక్కనున్న యిద్దరమ్మాయిల్నీ కుదిపేస్తూ నవ్వుతుందంటె తమలాటి మగవాళ్ళకెంత నామర్దా? ఎంతయిది?

ఆడవాళ్లైపోయారుగాని–లేకపోతే–'ఏమిటా వెధవనవ్వు, మీర్నూను' అని నిలబెట్టి నాలుగు కూకలేసే పనైపోను!

రాజమండ్రిలో 'బంతిపూవు' తాలూకు యిద్దరు నేస్తురాళ్ళూదిగిపోటంతో పెద్ద

బరువు దిగిపోయినంత పనయ్యింది వెంకట్రావుకి. మిగిలిన ఆ ఒక్క బంతి పూవునీ తీసుకుని రైలు కదిలింది. దానితో మళ్ళీ మగధీరులై పోయారు సోదరులిద్దరూ......

మళ్ళీ యిద్దరూ కలిసి కాసేపు మావయ్యని తిట్టారు. మరికొంతసేపు ఆయన ఆస్థి వివరాలు వగైరాల గురించి మాటాడుకున్నారు. మిగిలిన ఎక్కువ సేపు ఫెమినా చదువుకుంటూన్న 'బంతి పూవు'ని తీరుబడిగా, వివిధ కోణాల నుంచీ విడివిడిగా, కలిసి కట్టుగా తనివి తీరా చూచి ముగ్ధులై పోయారు.

చివరికి బెజవాడ స్టేషన్లో బంతి పూవుతోపాటు యిద్దరూ దిగిపోయారు. "బహుశా ఎల్లుండి తిరుగుప్రయాణం చేస్తాను. వుంటాను మరి." అని యింగ్లీషులో అనేసి, చివరిసారిగా అన్నట్టు బంతిపూవువైపు ఓచూపు విసిరి, చెయ్యూపి వెళ్ళిపోయాడు ముకుందం.

గాంధీనగరం సాంబశివంగారింటికి రిక్షా బేరమాడి బయలుదేరాడు వెంకట్రావు.

* * *

జేబులోవున్న ఫోటోతో పేపరు చదువుకుంటూన్న శాస్త్రిని పోల్చి చూచుకుని, సరిపోయినట్టు తెలుసుకుని, ఫొటోని జేబులో దాచేసుకుని గొంతు సరిచేసుకుని—

"మావయ్యా" అన్నాడు అల్లుడు వెంకట్రావు.

సాంబశివంగారు తలెత్తి చూశారు. తనముందున్న పసివాడిముఖంలో తన అక్కగారి పోలికలు కొట్టొచ్చినట్టు కనపడేసరికి—ఎటూ తేల్చుకోలేక ఉక్కిరిబిక్కిరై పోయి కాసేపటివరకూ ఏమీ మాటాడలేకపోయారు—అలా చూస్తూండడం మినహా.

"నేను మావయ్యా...వెంకట్రావుని. అంటే వెంకూని. మీ—"

"ను...నువ్వట్రా..."

"ఆ...నేనే...మరేమో...మీవంట్లో బావుండలేదని అమ్మ చెప్పింది. వీలు దొరికినప్పుడు ఓసారివెళ్ళి మావయ్యను చూచిరా నాయనా అని చెప్పింది. మరేమో..."

"వుండు. నువ్వు కాసేపు ఆపు నాయనా ... నాకు వంట్లో బాగోలేదనీ నన్నుచూచి రమ్మనీ, నిన్ను మీ అమ్మ పంపిందా? బలే...మీ అమ్మే స్వయంగా పంపిందట్రా..." బోలెంత ఆశ్చర్యంలో మునిగిపోయాడు సాంబశివం.

"నిజం మావయ్యా ... ఇప్పుడు అమ్మకి నీ మీద సలు కోపమేలేదు. నిన్ను తలవని రోజులేదు...అదీగాక—" అతని కంఠం గాద్గదికం కాగా యిలా అన్నాడు కాస్త గేప్ యిచ్చి "అన్నపూర్ణమ్మత్తయ్య పోయారా...ఇంకా యీ లేని పోని పగలూ, కక్షలూ గట్రాల్తో పనేమిటి

"...ఏనాటికైనా వాడు నాతమ్ముడు కాడా ఏమిటీ అని అమ్మ వూరికేయిదై పోతూంటుంది." కళ్ళు తుడుచుకున్నాడు వెంకట్రావు.

సాంబశివం అదోవిధంగా నవ్వారు. రెండుక్షణాలు మవునంగా గడిపి—

"సంతోషంరా అబ్బీ...చాలా సంతోషం...ఇలా జరుగుతుందని నాకు లోగడేతెలుసు. ఈ రోజు తప్పకుండా వస్తుదని నేనాడే గ్రహించాను. ఎలాగైనా మీ అమ్మ అసాధ్యురాలు...సరే... ముందు స్నానం ముగించు...తర్వాత తీరుబడిగా అన్ని విషయాలూ మాటాడుకుందాం." అని, పనిమనిషిని పిలిచి స్నానానికి నీళ్ళుతోడమని చెప్పారు సాంబశివం.

కొత్తగా కట్టించిన యిల్లది. అధునాతనంగా, అందంగా, అమిర్చి పెట్టినట్టు కట్టారు. పనిగట్టుకుని గబగబా అన్ని గదులూ పరీక్షించేశాడు వెంకట్రావు. తనక్కావలసిన 'వస్తువు' ఎక్కడా కనిపించక పోయేసరికి పిచ్చెత్తినట్టయింది. అలా పిచ్చెత్తి తిరుగుతున్న వెంకట్రావు ఓచోట బ్రేకు వేసినట్టు ఆగిపోయాడు. గోడకున్న ఫొటోనుచూస్తో గుటకలు (లెక్కపెట్టుకుంటూ) మింగాడు. రైల్లో కనిపించిన బంతిపూవు ఆఫోటోలో నవ్వుతోంది. (నవ్వడం యీ పిల్లకి హాబీయేమొ!)



"అరె, ఆశ్చర్యంగాఉందే!!! ఈ జోక్ వేసినప్పుడు ఆఫీసులో మేనేజరు దగ్గరనించి గుమాస్తాలవరకూ, పొట్టలు బద్దలయ్యేలా నవ్వేరే!?"

ఇంతలో వెనుకనుంచి సాంబశివం గారి నవ్వువినిపించేసరికి ఉలిక్కిపడ్డాడు. దడుచుకున్నాడుగూడా. తర్వాత ఆయన నవ్వుమొగం చూచి సిగ్గుతో తలవంచుకున్నాడు.

"అమ్మాయి పద్మది ఫోటో! ఎవరో స్నేహితురాలి పెళ్ళికివెళ్ళింది. ఆ...అది సరేగాని నువ్వు ముందు స్నానంచేసి. కదులు త్వరగా."

వెధవది...ఎంత డేంజర్ జరిగిపోయిందీ; రైల్లో సాక్షాత్తు పద్మముందే మావయ్య పుట్టుపూర్వోత్తరాలు తిరగేశాడు. నోటికొచ్చినట్టు తిట్టాడు.

అవన్నీ విన్న (బహుశావింటె) తనమీద ఎంత మండిపడిపోతుందో గదా పద్మ; అయినా రైల్లో కలిసిన ప్రతిఅమ్మడూ తన మావయ్య కూతురే కావాలని ఎవడికి తెలుసు! అంతా 'క్పైవట్ ఆక్సిడెంటల్'! మిజరబుల్ యిన్సిడెంటు! ఇంతకీ ఆ వెధవ ముకుందం చేరాడు కాబట్టి కథ కదపవలసి వచ్చిందిగాని లేకపోతే ఎంత గుట్టుగా వచ్చేపని ?

స్నానమయిన పిదప తీరుబడిగా పై విధంగా ఆలోచిస్తూన్న (తలదువ్వు కుంటూ) వెంకట్రావుకి ముకుందం మాట వినిపించేసరికి గుండెల్లో ఆటంబాటు పేలి నంత పనయింది –

''మొన్ననే వాచ్చేవాణ్ణి మావయ్యా- వీలు దొరక్క రాలేకపోయాను."

ఓరి వీడి దుంపతెగా – వీడూ కోట లోకే చేరాడూ ? ఎవడో దిక్కుమాలిన వాడిపెళ్ళని కోశాడుగదా! మొత్తానికి తనకే తొడిగాడు టోపి! వచ్చీరావడం తోనే మావయ్యని దువ్వేస్తూన్నాడేమిటీ ఖర్మం!?

"ఏమిట్రాయిది? కలకాదుగదా! ఏనాడూ నా గుమ్మంతొక్కని అన్నదమ్ము లిద్దరూ కలిసికట్టుగా వచ్చారు'' అని సాంబశివంగారు ఆశ్చర్యంలో మునిగి, అంతలోకే తేరుకుని "అదిగో-అమ్మాయి గూడా వచ్చేసింది. రా ... తల్లీ ... రా మంచిసమయానికే వచ్చావు. ఒరేయ్ వెంకూ యిల్లారారా..." అని ముగ్గుర్నీ ఒకచోటచేర్చి పరిచయాలు మొదలెట్టారు. "వీడు వెంకట్రావని మా పెద్దక్క కొడుకు- వీడు ముకుందమని చిన్నక్క కొడుకు- మా అమ్మాయి పద్మ –"

ఆమె కిలకిలా నవ్వుతూ నమస్కారం చేసింది. తేలుకుట్టిన దొంగల్లా యిద్దై పోయారు యిద్దరన్నదమ్ములూ –

"వాటె ఆపుల్ ట్రాజడీ!" అను కున్నాడు ముకుందం.

"అంతా కథకుడిదయ!" అనుకున్నాడు వెంకట్రావ్.

"అమ్మబాబోయ్ – మీరెంతకైనా వున్నారు!" అనుకుంది పద్మ.

ఆ రాత్రి –

ముకుందం, వెంకట్రావ్ యిద్దరూ హంగామా చేసేసుకున్నారు.

"ఏ మాట కామాటే చెప్పుకోవాలి! మొదట్నుంచీ మావయ్యంటె నా కదో విధమైన ప్రేమ. మావయ్య లవ్‌మారేజి చేసుకున్నాడు. అందుకైనా ఆయన్ను అభినందించాలి; ఆ వ్యక్తిత్వానికి చేతులు రెండూ జోడించాలి. నువ్విప్పుడు నన్నడ గొచ్చు – మరింత అభిమానం వొలగ బోస్తూన్నవాడివి నాతో ఎందుకు అబద్ధ మాడావూ – అని. ఫర్ దట్ దేరీజ్ కాజ్. నేనిలా వచ్చానని అమ్మకి తెలిస్తే, మానాన్నకీవిషయం తెలీజేసి నా చర్మం వలిపిస్తుంది. అంచాత బొంకడం తప్ప లేదు,'' అన్నాడు ముకుందం.

ముక్కుమీద వేలేసుకుని 'హౌరా' అని ఎంతో ఆశ్చర్యం పడిపోయి తేరుకున్నాడు వెంకట్రావు. ఎలాగైనా ప్రయోజకుడే ముకుందం.

"నా మనసులోని నాలుగుమాటలూ నువ్వేచెప్పావు. సరిగ్గా నువ్వు చెప్పిన కారణం చేతనే నేనూ అబద్ధం చెప్పాల్సి వచ్చింది." అని, ఆ తర్వాత లవ్ మారేజెస్ గురించి ఓఅరగంట ఉద్ఘాటించి, నిద్రపోటానికి వచ్చి — నిద్రపోకుండా ఆలోచనల్లో మునిగిపోయాడు వెంకట్రావ్.

ముకుందానికి మావయ్యమీద గౌరవమూ భక్తీ వుండికాదు—వాడు యిక్కడికొచ్చింది. పద్మ! పద్మకోసం వచ్చివుంటాడు. బంగారు పిచ్చుకంటె ఎవడికిష్టంకాదూ? మావయ్య వెనకాతల లక్షలు మూలుగుతున్నాయి, నన్ను మోసేవాడెవడంటూ.

పద్మకోసం పోటీ ప్రారంభమయ్యిందన్నమాట యిప్పుడిహ నిజమయ్యింది. గెల్చుకున్నవాడు అదృష్టవంతుడు. పద్మనెలా గెల్చుకోవాలో — దానిక్కావలసిన పథకమేమిటో ఆలోచిస్తూ ఉండిపోయాడు వెంకట్రావ్.

*　　*　　*

ఆసాయంత్రం పళ్లూ, మిఠాయీ వగైరా తీసుకుని వస్తున్నాడు వెంకట్రావ్. ఇక్కడికొచ్చేముందు అమ్మ తనకెన్నో బోధించి పంపింది.

అమ్మ చెప్పినట్టు పద్మ చక్కని చుక్క! పద్మ తనకు నచ్చిందనడంలో ధోకాలేదు. ఎటూ తనే పద్మకు నచ్చాలి—

అనుకోకూడదుగాని పద్మలాటి అందమైన అమ్మాయిలు చాలామంది తనని (కాలేజీ రోజుల్లో) ప్రేమించేశారు. సరోజ, వాసంతి, విమల, కమల—యిలా చాలామంది తనతో మాటాడ్డమే పెద్ద అదృష్టం క్రింద తీసుకున్నారు. అలాంటిది ఆఫ్టరాల్ పద్మ ఎంత!

పద్మ మనసు తనవైపు తిప్పుకున్న తర్వాత మావయ్యని మంచిచేసుకోవాలి. ఆయన చల్లని చూపుగూడా తనవైపు మొగ్గితే యింక సమస్యంటూ ఏమీలేదు.

తను యిక్కడ వుండదలుచుకున్న వారంరోజుల్లోనూ యీ పనులేవో చక్కబెట్టుకుంటేనేతప్ప ప్రయోజనంలేదు.

ఈ ముకుందం రాకపోతే తన బాధేదో తను పడేవాడు. సమయానికి పీడూ వచ్చాడు గదా ఖర్మం!—అసలు మావయ్య లక్షాధికారయ్యాడన్న ఓ మహత్తర రహస్యం వాళ్ళకి తెలీకపోతే ఎంత బావుండేది? పైగా—పిన్నికి డబ్బంటె పిచ్చి!

అదీగాక—ముకుందం అదృష్టజాతకుడని చిన్నప్పుడు అమ్మమ్మ అంటూండేది. ఆవిడ ఆశీస్సు నిజమైపోతే తన గతేంగాను? అందచందాలలోనేమీ చదువు సంధ్యల్లో నైతేనేమీ ముకుందం తన

ముందేమాత్రం తీసిపోడు. ఒకవిధంగా అతనే మెరుగనిపిస్తాడేమో గూడాను.

ఏమంటే — అతను కాబోయేడాక్టరు. తను చాలీ చాలని జీతంతో కుస్తీపడు తూన్న గుమాస్తా. అతను 'షైన' వ్వ టానికి అవకాశం దగ్గర్లో వున్నది. తను పద్మని చేసుకుంటేనే తప్ప ఆ అవకాశం లేదు.

వసుధా మావయ్య (పద్మవిషయం అంత త్వరగా చెప్పదలుచుకోలేదు) ముకుందాన్నే లైక్ చేస్తుండొచ్చు. కారణం ఏమంటే—మావయ్యలాటి లక్షాధి కారికి కావలసింది ఓ స్థితిలోవున్న అల్లుడు. దానికి వాడే తగును.

రేపొద్దున్న తనకు పద్మతో పెళ్ళయ్యి —కాపురంపెట్టిన తర్వాత "అయ్యా మగడూ, నీస్వార్జితంతో నాకో చిన్న రాళ్ళ నెక్లెసు చేయించవూ" అని నోరు తెరుచుకు పద్మ అడుగుతే — ఆ నోటిని అలాగే మూసేయగల దౌర్భాగ్యం తన కున్న అర్హతలో ముఖ్యమైనదీ, మొదటి దీను. అలాంటప్పుడు ఆపిల్ల తననేం ప్రేమిస్తుంది (కనీసం యీ వారం రోజుల్లో నైనా) వల్లకాడూ!

ఇది నిజంగా పెద్ద ప్రోబ్లమ్!

ఈ సమయంలో ఆ ముకుందం గనక రాకపోయినట్టయితే, తనెలాగో తంటాలుపడి, చాతుర్యాన్ని ఉపయో గించి ఆ తండ్రీ కూతుళ్ళని తనవైపు తిప్పుకునేవాడు. వాడొచ్చి తిష్ఠవేస్తూ న్నాడుగదా మధ్య!

పద్మ ప్రేమించినా, ప్రేమించక పోయినా మామయ్య అనుగ్రహించినా, యించకపోయినా వారంరోజుల్లో తేలి పోవాలి. తను ఉద్యోగస్థుడు గనక టంఛన్‌గా వారంరోజులు గడవగానే గుడ్‌బై కొట్టి తనదారేదో తను చూచు కోవాలి.

ముకుందం మాట వేరు —

అతను స్టూడెంటు — పైగా ట్రంకు లాటి సూటుకేసుతో దిగబడ్డాడు. ఎన్నా ళ్లుంటాడో ఖర్మం! కాకా పట్టడంలో అతడారితేరిన ఘటం. ఇన్నాళ్ళ సర్వీసు లోనూ ఆఫీసరుముందెలా నించోవాలో గూడా నేర్చుకోలేదు తను. అలాంటిది యీ బోడి వారంరోజుల్లో యింకేం కాకా ఏడుస్తాడూ?

సాంబశివంగారి యిల్లు చూడగానే తన ఆలోచనకు సడన్ బ్రేకు వేశాడు. నెమ్మదిగా ఆయింటి గుమ్మం ఎక్కాడు. తెచ్చుకున్న నవ్వుని ముఖంనిండా పులుముకుని.

అప్పటివరకూ ముకుందంతో మాటాడుతున్న మావయ్య తని చేతిలోని సరుకులు చూచి అడిగాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకురా?— డబ్బు దండక్గా."


"ఏదోలే మావయ్యా!" అంటూ మెలి కలు తిరిగి పోయాడు వెంకట్రావ్.

చేతిలో సరుకులు యింట్లోపెట్టి మావయ్య దగ్గరకొచ్చి కూర్చో బోయాడు. తనవంక అదోవిధంగా చూశాడు ముకుందం. అదేవిధమో పరిశోధించదలచి, దానికంటె ముందుగా — యింతకిముందు మావయ్య వాడితో ఏం మాటాడో ఊహించాలని తలిచాడు.

ఏదీ తల్చుకోకముందే — ట్రిమ్‌గా టాయ్‌లెట్టయి 'హలో' విష్‌తాలూకు, పద్మ తాలూకు చిన్నసైజు నవ్వు వెంకట్రావుని కలవరపెట్టేసింది. అదే నవ్వుకోసం ఎదురుచూస్తోన్న ముకుందం సాక్షాత్తు కుర్చీలోనే ఎనిమిదై పోయాడు.

"బజారు ప్రయాణమనుకుంటాను. వెళ్ళిరా...ఎలాగూ వెళ్ళేదానివి వెడుతున్నావు — ముకుందాన్ని వెంటబెట్టుకుని వెళ్ళు. వెంకట్రావిప్పుడే బజార్నుంచి వచ్చాడు. వాడితో నేను మాటాడుతూంటాను. వూ...వెళ్ళవోయ్ ముకుందం." అని సాంబశివంగారు అన్న మరుక్షణంలోనే ముకుందం పద్మ పక్కన నుంచున్నాడు. మరోరెండు క్షణాల్లో యిద్దరూకలిసి వెళ్ళిపోయారు.

వెంకట్రావ్ హృదయం భోరున ఏడ్చింది. ఇలా అఘోరిస్తుందని తెలిస్తే — యీ ఛాన్సు తను ఛస్తే వదులుకునేవాడు కాదు. ఏం లాభం? ఏది జరక్కూడదని యిప్పటివరకూ తలిచాడో అదే జరుగుతోంది. అమ్మమ్మ అన్నట్టు ముకుందం జాతక పురుషుడే!



"ఆడవాళ్ళ అఘాయిత్యాల గురించి నే చెప్పింది నమ్మినవాళ్లు త్వరగా వెళ్లండి! నమ్మనివాళ్లు మా ఆవిడ వచ్చేదాకా ఉండండి!."

"సెలవెన్నాళ్ళుందీ?" మావయ్య అడిగారు.

"ఊఁ—" బజారెళ్ళి వాళ్ళేం చేస్తారో ఊహించేస్తున్న అల్లుడు మావయ్య మాటకి సమాధానం ఎలా యివ్వగలడు?

"నిన్నేరా?" మావయ్య రెట్టించారు.

"ఓయ్—" అల్లుడు నిట్టూర్చాడు.

"సెలవెన్నాళ్ళు పెట్టావ్?"

"వారం. సెలవంతా యిక్కడే—"

"నిజం దాచకుండా చెప్పు — నువ్విలా రావటంలో నీ ఉద్దేశ్యమేమిటీ?" మాట మధ్యలోనే అడిగారాయన.

"........." (ఇలా నిగ్గదీసి ఓ ఖైదీని అడిగినట్టు, అటంబాంబు లాటి ప్రశ్న అడుగుతే అల్లుడేం చెపుతాడు కనక !)

"ముకుందాన్నీ యిదే అడిగాను. వాడికి పద్మని చేసుకోవాలని వుందిట."

ఉలిక్కి పడ్డాడు వెంకట్రావ్. ఓరి వీడి అమ్మకడుపు కాలా — ఆమాట కాస్తా చెప్పేశాడూ — ఎంతకైనా ఉన్నాడు !— అని అనుకున్నాడు వెంకట్రావ్.

"వాడు పద్మని చేసుకోడం వాళ్ళమ్మ క్కూడా యిష్టమేనట. ఇదివరకు లేని యీ యిష్టం యిప్పు డెక్కడ్నుంచి వూడిపడ్డదీ ? ఇదంతా ప్రేమేనంటావా ? లేక నాటకమా ?"

"నాటకం మావయ్యా ! బూటకం !" కక్షకొద్దీ ఉద్రేకంతో నాటకీయంగా అన్నాడు.

"తెలుసురా నాకు, నేనిప్పుడు లక్షాధికారిని. వాళ్ళక్కావల్సింది పద్మగాదు. లక్షలు."

"అవును, వాళ్ళక్కావల్సింది పద్మ కాదు. లక్షలు."

"మరి నీకు ?"

"(చచ్చాం పో...ఏమిటీ ముసలాడు? యిలా పిడుగుపడినట్టు టకటకా ప్రశ్నలు నరికేస్తున్నాడు మరీను.)"

"జవాబు చెప్పరా ?"

''నాకేమొ...పద్మేకావాలి." (సిగ్గు నభినయించాడు)

"మీ అమ్మకి !"

''మా అమ్మకా !— నీకు తెలీందే మున్నది మావయ్యా ? అమ్మా, పిన్నీ యిద్దరూ ఒక గూటి పక్షులేనాయె. కాని నా విషయం వేరు. నన్ను నమ్మ మావయ్యా; నమ్మ ! పెద్దాళ్ళ కెదురు చెప్పలేని చవటను గాను. కాను ! కాక పోతే యిన్నాళ్ళూ సమయంకోసం యెదురు చూశాను. ఇప్పుడింత సంపాయిస్తూన్న ప్రయోజకుణ్ణి అయ్యాను. స్వతంత్రంగా జీవించే చావ నాకుంది.'' ఉద్రేకంగా అన్నాడు.

అల్లుడి భుజం తట్టారు మావయ్య. నవ్వుతూ అన్నాడు, ''తెలివితేటల్లో మీ అమ్మని మించావురా వెంకూ. ఏది ఏమైనా పద్మ పెళ్ళి విషయంలో నా ప్రమేయం ఏమీలేదు. దానిపెళ్ళి దానిష్టప్రకారమే జరుగుతుంది. చదువుకున్నపిల్ల. దాని కన్నీ తెలుసు. కాని..ఒకమాట వెంకూ — మీ అమ్మా, పిన్నమ్మా వాళ్ళందరూ అవకాశవాదులు. గాలి ఎటు వూపితే అటు వూగే మనుషులు. వ్యక్తిత్వం నశించిన బ్రతుకులు వాళ్ళవి. ఒకనాడు నన్ను గేలి చేశారు. నాకూ వాళ్ళకీ సమ్మంధంలేదని దుమ్మెత్తిపోశారు. ఈనాడు నేనుకావల్సి వచ్చాను. ఎందుకో తెలుసా — నేను డబ్బున్న పెద్దమనిషిని. హు...లోకం."

''అవును మావయ్యా...హు..లోకం పాడులోకం. పాడుమనుషులు.'' అల్లుడు

వంత పాడాడు అప్పటికైనా ఆయన ఉద్రేకం చల్లారుతుందేమోనని.

సాంబశివం గట్టిగా నిట్టూర్చాడు.

వెంకట్రావ్ గోళ్లు గిల్లుకుంటున్నాడు ఆయన ముఖంలోకి చూచే ధైర్యంలేక. "పద్మావాళ్ళు వచ్చేసరికి ఎలాలేదన్నా ఓ గంటైనా పడుతుంది. ఈలోగా కాస్త కాఫీ తాగుదాం. వాళ్ళు వచ్చినతర్వాత అందరం కలిసే భోజనాలు చేద్దాం, లే."

* * *

అక్కడ పార్కులో..ఓ మూలగా.. పద్మా, ముకుందం.

"బలే గమ్మత్తుగా — యిక్కడ చూడకమునుపే మనకి పరిచయం కలిగిందికదూ," అన్నది పద్మ నవ్వుతూ.

"అవును...బలే గమ్మత్తు...నిన్ను ట్రెయిన్లో చూడగానే అనుకున్నాను పద్మా! ఈ అమ్మాయే మా మావయ్య కూతురు కాగూడదా అని. అదే అయ్యావు."

"ఆ కంపార్టుమెంటులో మీ యిద్దరి మాటలూ అక్కడక్కడా విన్నాను. నాన్న ప్రస్తావన వచ్చింది కాబోలు —" కళ్ళింత పెద్దవిచేసుకుని అడిగింది పద్మ.

"అయ్యోఖర్మం! వచ్చింది. వాడే, ఆ నన్నాసే తీసుకొచ్చాడు. నీకు తెలీదు గాని వాడెంత యిదనుకున్నావ్! అచ్చం వాళ్ళమ్మపోలికే. వాడికి మావయ్యంటే అసలు గిట్టిచావదు. పైకి ఆలావుంటాడే కాని వాడి స్టమక్నిండా పాయిజన్. విషం పద్మా! మేటరంటూ వచ్చింది కాబట్టి చెపుతున్నా — ముందస్తుగా మావయ్యని వెలివేసింది వాళ్ళమ్మేనుట. మా అమ్మ వాళ్ళమ్మకంటె చిన్నది కాబట్టి, పెద్దదనే గౌరవంకొద్దీ ఏం మాటాడలేక వూరుకుంది. నీకు యీ విషయాలన్నీ తెలియవుగావాలు! చిన్నదానివి గదూ!"

"అవును. తర్వాత పెద్దదాన్ని అవుతున్నకొద్దీ ఒక్కొక్కటీ తెలిసొస్తున్నది. నాన్న అన్నివిషయాలూ చెప్పారు."

"చెప్పరూ మరి! చెప్తారు. మావయ్య కాబట్టి, మంచితనం యింకా చావలేదు కాబట్టి వూరుకున్నాడు గాని, మరింకోదైతే యిలా పనిగట్టుకుని వచ్చిన వెంకట్రావ్ మెడపట్టుకుని బయటకు గెంటేవాడు, నాలుగు చివాట్లుగూడా పెట్టి. లేకపోతేనూ — ఆయన అలుసునిచూచి ఆట అడిద్దామనుకున్నాడు పూర్ ఫెలో! హుం" ఒకసారి అందంగా, హుందాగా పైసర్దుకున్నాడు ముకుందం.

ఈ వాలకం చూచేసరికి పద్మకి వళ్లు మండిపోయింది — అనవలసిన మాటేదో తిన్నగా అనేసింది —

"వెంకట్రావ్ ఒక్కడేకాదు-నువ్వూ అంతే —"

అనుకోకుండా యింత కథ అడ్డం తిరిగేసరికి ముకుందం వ్యాకులపాటు చెందాడు. పద్మని మనసులో యింగ్లీషులో తిట్టేసి బయటికి తెలుగులో యిలా అన్నాడు పేథటిక్‌గా —

"పొరపాటు పద్మా! నన్ను అపార్థం చేసుకున్నావు. నాగురించి నేను చెప్పు కోడం అనేది ఛస్తే అలవాటు పడలేదు. అయినా యిప్పుడు నువ్వన్న తర్వాత చెప్పక తప్పడంలేదు. నాకు మొదట్నుంచీ మీరంటే గాఢాభిమానం, ముఖ్యంగా — నిన్ను మనసారా ప్రేమించాను. ఐ లవ్ యూ పద్మా —"

పద్మ — పువ్వులా నవ్వింది — దీంతో మరీ యిదైపోయాడు అతను.

''సారీ బావా!"

"వై పద్మా?"

"నిన్ను నేను ప్రేమించలేదు."

ముకుందం కృంగిపోయాడు.

"నిన్నే కాదు. వెంకట్రావ్‌నిగూడా ప్రేమించడంలేదు. ఇంతకుమునుపు మీ యిద్దర్లో ఎవ్వర్తోనూ పరిచయంలేదు. ప్రేమంటె రెండురోజుల పరిచయమంటె నేనొప్పుకోను."

"దెన్! ... ఇంతకుముందే నువ్వు ఎవరైనా ప్రేమించావా? ఎక్సూజ్మీ! ఈవిధంగా అడిగి నిన్ను బాధపెట్టాలని నా ఉద్దేశ్యంకాదు. చెప్పు పద్మా ...... పర్వాలేదు. ఎవరైనా ప్రేమించావా?"

"అవును." అన్నది పద్మ.

ముకుందం నీళ్లు నమిలాడు.

"నే చేస్తూన్న ప్రతి పనిలోనూ నమ్మకం నాకుంటుంది. మూర్తి చాలా మంచివాడు. అతను మూడేళ్ళనుండి నాకు తెలుసు. నేనంటె అతనికి ప్రాణం. అతనిగురించి చాలా చెప్పాలని వున్నది. పదినిమిషాల్లో యిక్కడికే వస్తాడు, కావలిస్తే పరిచయం చేస్తాను. సరా."

"దట్సాల్‌రైట్ ... అయితే నేను వస్తానింక." అతను విసురుగా లేచి నిలబడ్డాడు.

"అప్పుడే వెడతావా? యింకాసేపట్లో మూర్తిగూడా వస్తాడుగా. అందరంకలిసి సినిమాకి వెడదాం. ఏమంటావ్?"

"మధ్య నేనెందుకూ, పానకంలో పుడకలాగా! అదీగాక కనిపించిన ప్రతి ఆడపిల్లతోనూ కలిసి తిరిగేస్థితికి నేనింకా దిగజారలేదు. బై ...బై ..." అతను ఆమె మాటైనా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

"గిల్టీఫెలో..." అన్నది పద్మ, అతను వెళ్ళినవైపు అసహ్యంగా చూస్తో.

* * *

ఆరాత్రికి రాత్రే ఏకారణం చెప్పకుండానే ముకుందం వెళ్ళిపోవడం వెంకట్రావుకి ఆశ్చర్యం కలిగించింది. మావయ్య (కొంత తనూ) ఎంతచెప్పినా వినిపించుకోనైనాలేదు. అతనంత త్వరగా వెళ్ళిపోవడం తనకి ఓ విధంగా మంచిదేనైనా — యిలా వెళ్ళిపోవడంలో గల కారణమేమిటో బోధపడటంలేదు.

వెంకట్రావ్ డిప్రెషన్లో మునిగి పోయాడు.

ముకుందం పద్మతోకలిసి బజారు వెళ్ళాడు. అతని ఆశకు అంతులేదు.

లోపల కోరిక తొందరచేసింది. నడి బజార్లో నోరుతెరిచి 'పద్మా నేను నిన్ను ప్రేమించాను—నన్ను అనుగ్రహించవూ' అని అడిగి వుంటాడు ముకుందం.

ఈ వాదస్తం పద్మకి రుచించలేదు. సమయాసమయాలు చూచుకోకుండా అర్జంటుగా నిన్ను ప్రేమించానూ అనేయడం—ఆమె ఉద్దేశ్యంలో ఓ బడుద్ధాయి లక్షణమయి వుంటుంది. పైగా—అప్పట్లో పద్మ మూడ్ గూడా ఏమంత బావుండి వుండదు. అతని ముచ్చటనైనా గమనించకుండా 'టాట్—నువ్వసలు నాకు నచ్చలేదు, పో—" అని కోప్పడి వుంటుంది. దాంతో అతని అభిమానం దెబ్బతిని, దానితాలూకు అవమానం భరించలేక వెళ్ళిపోయి వుంటాడు.

ముకుందానికి తగినశాస్తి జరిగింది: అసలాలాటివాడికలాగే జరగాలి! వెంకట్రావ్ మనసు కమ్మగా నవ్వి—ఓ చక్కటి పాట పాడుకున్నది.

—పద్మ వచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. అందరూ భోజనాలకు లేచారు. భోజనాలు ముగిసిన తర్వాత సాంబశివం తాంబూలం వేసుకుని—అలా వాకింగ్‌కి బయిలుదేరారు.

వెంకట్రావ్ తనగదిలోకివచ్చి కాలు కాలిన పిల్లిలా తిరగడం మొదలెట్టాడు. ముకుందం యింత హఠాత్తుగా ఎందు కెళ్ళిపోయాడో తెలుసుకోనిదే కన్నైనా మూయగూడదని శపథం పట్టాడు.

ఎంతకీ దారి కనిపించకపోవడంతో—అదేదో పద్మద్వారానే తెలుసుకుందామనే ఉద్దేశ్యంతో పద్మగదికేసి వెళ్ళాడు.

ఏదో పుస్తకాన్ని చదువుకుంటున్న పద్మకి, గుమ్మందగ్గరే నిలబడి తన రాకని సకిలింపుద్వారా తెలిజేశాడు. పద్మ పుస్తకంనుంచి తలత్రిప్పి వెంకట్రావ్‌ని చూచింది.

"రా..బావా! అక్కడే నిలబడ్డావ్?"

అతను లోపలి కొచ్చాడు.

"అలాకూర్చో.." కుర్చీచూపించింది.

అతను కూర్చున్నాడు.

"నాతో మాటాడాలని వున్నదా?"

తలూపాడు.

"ఇక్కడ మాటాడటానికి నీకేమైనా అభ్యంతరమైతే-అలా బయటకుపోదాం."

"నాకేం అభ్యంతరం? ఇక్కడే మాటాడుకోవచ్చు."

"ఏమిటది," పుస్తకం అవతలపెట్టి, రెండుచేతులూ బుగ్గన పెట్టుకుని వయ్యారంగా అడిగింది.

"అబ్బే.. ఏంలేదు..మరి..ముకుందం యిందాక ఏ కారణం చెప్పకుండానే వెళ్ళిపోయాడు. అలా—"

"అది తెలుసుకోవాలని వున్నదా?"

"మరె ... వాడి వాలకం విడ్డూరంగా వున్నది. కోపంగా ఒక్కడే వచ్చాడు. సూటుకేసులో వాడి బట్టలన్నీ సర్దుకున్నాడు. మావయ్యా, నేనూ కారణ

మడుగుతున్నా వినిపించుకోకుండానే వెళ్ళిపోయాడు. ఇదంతా చూస్తూంటే నాకనిపించిందేమంటే-నువ్వే అతన్నేదో అన్నావని.'' తన డిటెక్షన్ వివరించాడు.

"సరిగ్గా యిలాగే జరగలేదు.''

"మరి."

"పోనీలేబావా, ఇప్పుడవన్నీ ఎందుకసలు. అయినా ఆ కారణమేమిటో చెపితే నువ్వు బాధపడతావ్." తనచూపుని గది గోడమీదనిలిపి, అతన్ని క్రీగంటచూస్తూ అన్నది పద్మ.

"ఛ... నా గురించి నువ్వు తెలుసుకున్నదింతమాత్రమేనా ? నిన్నెంతగా_"

"ఆగుబావా ... ఆ మాట నన్నుచెప్పనివ్వు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు గదూ !"

"ఆహ ... అక్షరాలా !_" ఆమె తెగింపుకి ఆశ్చర్యపోయాడు వెంకట్రావ్.

"అందుకే అంటాను, ఆవిషయం చెప్పి నిన్ను బాధపెట్టడం నా కిష్టం లేదని.''

"నేను ముకుందంలాటి చపటను కాదు పద్మా !''

"అంతటివాడవు కాపోయినా _ ఆ కోవకే_"

"పద్మా!" అతనికోపం వచ్చింది. "ముకుందం పేరు నా ముందెత్తకు. వాడి ఆశకు అంతులేదు. వాడిక్కడికి ఎంత ప్లానుతో వచ్చాడనుకున్నావ్? ఏంకథ ?''

"తెలుసు. అయితే నా గురించే అతనికి తెలీదు. మూర్తి గురించి వినగానే పరుగెత్తాడు.'' కిలకిలా _ పిచ్చిహరి సన్నాయిలా నవ్వింది పద్మ.

"ఎవరామూర్తి ?" ఆత్రంగా అడిగాడు వెంకట్రావ్.

"మే మిద్దరం పెళ్ళి చేసుకో బోతూన్నాం !"

"పెళ్లా ... మీరీద్దరా ? మరీసంగతి మావయ్య చెప్పనే లేదే !"

"ఇంతవరకూ ఆయనకు చెప్పలేదు. రేపు ఆయనే అంటారు _ మూర్తితో పద్మపెళ్ళి నా కిష్టమే_అని..మీ యిద్దర్నీ చూస్తోంటే నాకు నవ్వువస్తుంది బావా ?" అన్నది నవ్వుతూనే.

"చాలా సంతోషం ... నాకు నిద్ర వస్తోంది. వస్తా..." అతను నీరసంగా వెళ్ళిపోయాడు.

ఆ తెల్లవారు ఝామునే, ఎవ్వరూ నిద్రలేవకమునుపే, తనపెట్టేబేడా సర్దుకుని కాలికి బుద్ధి చెప్పాడు వెంకట్రావ్.

కూతురు చేసిన ఘనకార్యానికి కడుపారా నవ్వారు సాంబశివం. ఆనక - యీ కథలో చెప్పా పెట్టాకుండా ప్రవేశించిన పాత్రధారి వివరాలేవో తెలీక మతిపోయినంత పనై _ పద్మని అడిగారు;

"అవునూ _ యీ మూర్తిగురించి నాకింతవరకూ చెప్పావు కావేంతల్లీ _"

"నాకు తెలుస్తేగదా మీకు చెప్పటానికి." అని పకపకా నవ్వింది పద్మ !

★